సాక్షి పెద్దపల్లి

సోమవారం ׀ 3 ׀ జూలై ׀ 2023



కొత్త రేషన్ కార్డులు ఎప్పుడిస్తరో?

ఏళ్లు గడుస్తున్నా ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు ఇవ్వడం లేదు. దీంతో ఎక్కువ సంఖ్యలో ఉన్న మధ్య తరగతి కుటుంబాలకు చెందిన వారు ఇబ్బంది పడుతున్నారు. 8లో▸



గ్రామాల్లో కప్పతల్లి ఆటలు

పెద్దపల్లిరూరల్: వర్షాలు కురవాలని పెద్దపల్లి మండలం ముత్తారంలో చిన్నారులు కప్పతల్లి ఆడారు. కప్పతల్లిపై నీళ్లు పోస్తూ వానలు కురవాలని ప్రజలు వేడుకున్నారు.

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 35.0/26.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. కొన్నిచోట్ల చిరుజల్లులు, మరికొన్ని చోట్ల తేలికపాటి వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

హస్తకళలను ప్రోత్సహించండి



మంత్రికి జ్ఞాపిక అందిస్తున్న వీరాలాల్

జ్యోతినగర్: హస్తకళలను ప్రోత్సహించాలని, ప్రభుత్వం ద్వారా మహిళలకు స్వయం ఉపాధి రంగంలో శిక్షణ అందించాలని ఉద్యమ నాయకుడు వీరాలాల్ చౌహాన్ మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు వినతిపత్రం అందించారు. కరీంనగర్‌లోని ఆయన నివాసంలో కలిసి వెదురుకర్రపై మంత్రి ఫొటోను ముద్రించిన జ్ఞాపికను అందించారు. నిరుద్యోగ యువత, మహిళల అభివృద్ధికి వెదురుబొంగులతో తయారు చేసే హస్తకళపై ప్రభుత్వం శిక్షణ ఇప్పించాలని సూచించారు. వెదురు బొంగులపై ఫొటోలను ముద్రించే కళను నేర్పించేందుకు సారా సంస్థ చైర్మన్, డైరెక్టర్ బట్టు వసంత సిద్ధంగా ఉన్నారని వెల్లడించారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించినట్లు వెల్లడించారు. ఆయన వెంట దేదావత్ రమేశ్‌నాయక్, మేకల శారద ఉన్నారు.

నేటి నుంచి ప్యాసింజర్ రైళ్లు రద్దు



ప్యాసింజర్ రైలు

రామగుండం: సికింద్రాబాద్ డివిజన్ పరిధిలో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పునరుద్ధరణ పనుల నేపథ్యంలో పలు రూట్లలో ఈనెల 9వరకు ప్యాసింజర్ రైళ్ల రాకపోకలను రద్దు చేస్తున్నట్లు దక్షిణమధ్య రైల్వే అధికారులు తెలిపారు. రద్దయిన ప్యాసింజర్ రైళ్లలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో సిర్‌పూర్‌టౌన్ – కరీంనగర్ ఇరువైపులా (07765/66), కరీంనగర్–నిజామాబాద్ ఇరువైపులా (07893/94), కాజీపేట–సిర్‌పూర్ టౌన్ (17003), బల్హార్షా–కాజీపేట (17004), భద్రాచలం రోడ్–బల్హార్షా (17033), సిర్‌పూర్ టౌన్–భద్రాచలం రోడ్ (17034), కాజీపేట–బల్హార్షా ఇరువైపులా (17035/36) ఉన్నాయి. ప్రయాణికులు ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని రైల్వే అధికారులు కోరారు.

ముగిసిన ఎంసెట్ సర్టిఫికెట్ల వెరిఫికేషన్



సర్టిఫికెట్లు పరిశీలిస్తున్న అధికారులు

గోదావరిఖనిటౌన్: స్థానిక పీజీ కళాశాలలో ఎంసెట్–2023 మొదటిదశ ధ్రువీకరణపత్రాల పరిశీలన ఆదివారంతో ముగిసిందని కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.రమాకాంత్ తెలిపారు. వెరిఫికేషన్ పూర్తయినవారు జూలై 8వరకు వెబ్‌ఆప్షన్లు ఇచ్చుకోవాలని సూచించారు. మొదటిదశ వెరిఫికేషన్‌కు 985 మంది హాజరయ్యారని పేర్కొన్నారు. వెరిఫికేషన్‌లో హెల్ప్ లైన్ సెంటర్ కోఆర్డినేటర్ సురేష్‌కుమార్, అధి కారులు డాక్టర్ రమేశ్, డాక్టర్ రవి, డాక్టర్ ప్రసాద్, అజయ్, సావిత్రి, యాదయ్య పాల్గొన్నారు.

రైస్‌మిల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

పెద్దపల్లిరూరల్: రైస్‌మిల్లు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముత్యంరావు కోరారు. పెద్దకల్వల, రంగంపల్లిలోని రైస్‌మిల్లుల్లో పనిచేసే ఆపరేటర్లు, గుమస్తాలు, హమాలీలు, కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం కనీస వేతనాలను 15ఏళ్ల కాలంగా పెంచకుండా జాప్యం చేస్తోందని ముత్యంరావు ఆరోపించారు. పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలకు అనుగుణంగా వేతనాలను సవరించాలని డిమాండ్ చేశారు. నాయకులు అంజయ్య, శరత్‌రెడ్డి, రవీందర్ ఉన్నారు.

సుతిలి కుంభకోణంపై 4న విచారణ

మంథని: మంథని సింగిల్‌విండో పరిధిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సుతిలి కుంభకోణంపై వచ్చిన ఫిర్యాదుపై ఈనెల 4న విచారణ చేపట్టనున్నట్లు జిల్లా సహకార అధికారి మైఖేల్ బోస్ తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో సుతిలి కొనుగోలు, ఇతర ఖర్చుల్లో కుంభకోణం జరిగిందని, దీనిపై విచారణ జరిపించాలని మంథనికి చెందిన ఇనుముల సతీశ్ గత ఏప్రిల్ 17న ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో విండో కార్యదర్శి, ఫిర్యాదుదారులను విచారణకు హాజరు కావాలని సహకార అధికారి సమాచారం పంపించారు.

ప్రజారోగ్యంతో చెలగాటం

- బయో మెడికల్ వేస్టేజీపై ఆసుపత్రుల నిర్లక్ష్యం
- కలెక్టర్ ఆదేశాలనూ ఖాతరు చేయని వైనం
- డస్ట్‌బిన్‌లో పడేస్తున్న ప్రమాదకర వ్యర్థాలు
- బహిరంగ ప్రదేశాల్లో కాలంచెల్లిన మందులు
- పట్టించుకోని సంబంధిత అధికారులు



ఈ చిత్రం గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి (జీజీహెచ్) సమీపంలోని చెత్తలో కుప్పలుకుప్పలుగా కనిపిస్తున్న కాలం చెల్లిన మందులు, సిరప్‌లు. ప్రైవేట్ మెడికల్ షాపుల నిర్వాహకులు ఇలా బహిరంగప్రదేశాల్లో పడేశారు. 200 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలో డిస్పోజ్ చేయాల్సిన కాలంచెల్లిన మందులు ఇలా డంపింగ్‌యార్డుల్లో కుళ్లిపోతున్నాయి. ఆపరేషన్ సమయంలో పేషెంట్ల నుంచి తొలగించిన వ్యర్థాలు, సిరంజీలు, దూది, ప్లాస్టర్లు, ఇంజెక్షన్లనూ చెత్తలో పడేస్తున్నారు. చెత్త కుప్పల్లో కుళ్లిపోవడంతో ఎయిర్ పొల్యూషన్ పెరుగుతుందంటున్నారు నిపుణులు.



డస్ట్‌బిన్‌లో పడేసిన బయో మెడికల్ వేస్ట్

కోల్‌సిటీ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛభారత్ పేరుతో పరిసరాల పరిశుభ్రత ముఖ్యమంటూ విస్తృతంగా చర్యలు చేపడుతుంటే.. జిల్లాలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులు, ల్యాబ్‌లు మాత్రం ప్రజారోగ్యంతో చెలగాటం ఆడుతున్నాయి. ఆపరేషన్ సమయంలో తొలగించిన వ్యర్థాలు, వినియోగించిన సిరంజీలు, రక్తంతో తడిసిన కాటన్, కాలం చెల్లిన మందులను నిర్లక్ష్యంగా చెత్త కుప్పల్లో పడేస్తున్నారు. రామగుండం కార్పొరేషన్‌తోపాటు పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని మున్సిపాలిటీల్లో కూడా ఇదే నిర్లక్ష్యం కనిపిస్తోంది. నిబంధనలను ఉల్లంఘిస్తున్నవారిపై చర్యలు తీసుకునేవారు కరువయ్యారు. బయో మెడికల్ వేస్ట్ మేనేజ్మెంట్ 2016 నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ సంగీత పలుసార్లు హెచ్చరించినా ఫలితం లేకుండాపోయింది.

డేంజర్ బయో మెడికల్ వేస్ట్

ఆసుపత్రుల్లో వెలువడే బయోమెడికల్ వేస్ట్ మామూలు చెత్తకన్నా చాలా ప్రమాదకరం. వివిధ వ్యాధుల బారినపడిన వారికి వైద్యం చేసినప్పుడు, గాయాలైతే కుట్లు వేసేటప్పుడు, ఇంజెక్షన్స్ చేసినప్పుడు, బ్లడ్ క్లీన్ చేసినప్పుడు వాడిన ప్రతి వస్తువు.. రోగి నుంచి తొలగించిన వ్యర్థాలు, శరీర భాగాలు మెడికల్ వేస్ట్ కిందకే వస్తాయి. సిరంజీ ఒకసారి వాడాక అలాగే పడేస్తారు. రోగి రక్తం, రోగ లక్షణాలున్న డీఎన్‌ఏ వంటివి సిరంజీకి అంటుకుని ఉంటుంది. పొరపాటున ఎవరికైనా గుచ్చుకుంటే ఇన్ఫెక్షన్ అవుతుంది. ఆసుపత్రుల నుంచి ఇలాంటి బయో వేస్ట్ సక్రమంగా డిస్పోజ్ చేయకపోతే కొత్త సమస్యలు వస్తాయి. ఈ విషయంలో జిల్లాలోని కొన్ని ఆస్పత్రులు, ల్యాబ్‌లు, మెడికల్ షాపులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. కాలం చెల్లిన మందులు కూడా బయో వేస్ట్‌లో భాగమే. చాలామంది రిటైలర్లు కాలంచెల్లిన మందులను చెత్తలో వేస్తున్నారు.

పారిశుధ్య సిబ్బందికి ఇబ్బందులు

మున్సిపాలిటీల్లో ఏ చెత్త కుప్పలో చూసినా బయో మెడికల్ వేస్టేజీ కనిపిస్తోంది. ఆస్పత్రుల్లోని వ్యర్థాలను బహిరంగ ప్రదేశాలు, రోడ్లపై పడేస్తున్నారు. వీటిని పారిశుధ్య సిబ్బంది చెత్తలో కలిపి డంపింగ్ యార్డ్‌కు తరలిస్తున్నారు. చెత్త సేకరించే సమయంలో ఇబ్బంది పడుతున్నారు.

ఇవీ నిబంధనలు..

పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సూచించిన విధంగా ఆస్పత్రిలో ప్రత్యేకంగా నాలుగు రంగుల డబ్బాలు ఏర్పాటు చేయాలి. ఏ డబ్బాలో ఏయే వ్యర్థాలు వేయాలో సూచించే బోర్డులు అంటించాలి. పెద్ద ప్లాస్టిక్ కవర్లలో వ్యర్థాలను వేసి గట్టిగా ప్యాక్ చేయాలి. తర్వాత బయోమెడికల్ వేస్టేజ్ సేకరించే సంస్థకు అప్పగించాలి. ప్రతిరోజూ కొత్త డబ్బాలలో కవర్లను మారుస్తూ ఉండాలి.

కరీంనగర్‌లో వ్యర్థాల సేకరణ సంస్థ

కరీంనగర్ వావిలాలపల్లిలోని వెంకటరమణ ఇన్సినరేటర్ సంస్థ బయోమెడికల్ వేస్టేజీను తరలించడానికి జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలకు వస్తుంది. ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల నుంచి ఈ సంస్థ వ్యర్థాలను సేకరిస్తుంది. ఇందుకు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు నిబంధనల ప్రకారం ఫీజు కూడా తీసుకుంటోంది. సేకరించిన వ్యర్థాలను సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు నిబంధనల ప్రకారం కరీంనగర్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్లాంట్‌లో కాల్చివేస్తారు. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగాలి. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి. కానీ.. సదరు సంస్థకు బయోమెడికల్ వేస్ట్‌ను ఇవ్వకుండా చాలామంది చెత్తకుప్పల్లో పడేస్తున్నారు.

తనిఖీలు చేస్తున్నాం

జిల్లాలోని మెడికల్ షాపులను ప్రతినెలా ఆకస్మికంగా తనిఖీ చేస్తున్నాం. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటున్నాం. కాలం చెల్లిన మందులను బహిరంగ ప్రదేశాల్లో పడేయొద్దు. వాటిని సరఫరా చేసే సంస్థలకు అప్పగించాలి. ప్రతి మెడికల్ షాపు నిర్వాహకులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలి.

– చందన, డ్రగ్ ఇన్‌స్పెక్టర్, పెద్దపల్లి

నోటీసులు జారీ చేస్తాం



బయో వేస్ట్‌ను చెత్తలో పడేస్తున్న ఆస్పత్రులను గుర్తించి నోటీసులను జారీ చేస్తాం. ఆస్పత్రి వ్యర్థాలను ఇన్సినరేటర్ సంస్థకు అప్పగించాలి. లేకుంటే మున్సిపల్ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటాం. వేస్ట్‌ను మున్సిపల్ చెత్తలో కలువకుండా అడ్డుకునేందుకు వెంటనే శానిటేషన్ విభాగం అధికారులకు ఆదేశాలు జారీ చేస్తాం.

– బి.సుమన్‌రావు, మున్సిపల్ కమిషనర్, రామగుండం

రద్దీకి అనుగుణంగా బస్సులు నడపండి

- ఆర్టీసీ జోనల్ ఈడీ వినోద్‌కుమార్



ఉద్యోగులకు సూచనలిస్తున్న ఈడీ వినోద్‌కుమార్

మంథని: బస్టాండ్‌లో ప్రయాణికులకు రద్దీకి అనుగుణంగా ఆయా రూట్లలో బస్సు సర్వీసులను నడపాలని ఆర్టీసీ జోనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వినోద్‌కుమార్ సూచించారు. ఆదివారం మంథని బస్సు డిపో, బస్టాండ్‌ను తనిఖీ చేశారు. ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించాలన్నారు. డిపో నష్టాల నుంచి లాభాల్లోకి రావడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఉద్యోగులకు వివరించారు. ముందుగా డిపో అభివృద్ధిపై సమీక్షించారు. డిపో ఆవరణలో మొక్కలు నాటారు. రీజనల్ మేనేజర్ సుచరిత, డిప్యూటీ రీజనల్ మేనేజర్ చందర్‌రావు, డీఎం శ్రీనివాస్, ఎస్‌టీఐ ఏంజల్, ఏఎంఎఫ్ రామస్వామి, సూపరింటెండెంట్ శంకరయ్య, తదితరులు ఉన్నారు.

మరణించిన వ్యక్తికి ఉద్యోగావకాశం

- నేడు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఉందంటూ ఫోన్

పెద్దపల్లిరూరల్: జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో ఎంఐఎస్ కో–ఆర్డినేటర్, డాటా ఎంట్రీ ఆపరేటర్, ఏపీఓ, ఐఈఆర్‌పీ పోస్టులకు 2019లో దరఖాస్తు చేసుకున్న వారికి సోమవారం (ఈనెల 3న) సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఉందంటూ డీఈవో కార్యాలయం నుంచి సమాచారమందింది. ఇదే క్రమంలో జిల్లాకేంద్రంలోని శాంతినగర్‌కు చెందిన కోరెపు శంకర్‌కు కూడా సమాచారం వచ్చింది. ఆయన 2019లో దరఖాస్తు చేసుకున్నాడు. కరోనా వైరస్‌తో గతంలోనే చనిపోయాడు. అధికారులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా.. శంకర్ చనిపోయాడని తెలిపామన్నారు. దరఖాస్తుదారులందరికీ సమాచారం అందిస్తున్నామని, శంకర్ మరణించిన విషయం తమ కార్యాలయం సిబ్బందికి తెలియకపోవడంతోనే ఫోన్ చేసి ఉండొచ్చని డీఈవో మాధవి తెలిపారు. పోస్టుల భర్తీ ప్రక్రియపై కోర్టుకు వెళ్లడంతో జాప్యమైందన్నారు.

సబ్బండ వర్గాల సంక్షేమమే లక్ష్యం

జూలపల్లి: రాష్ట్రంలోని అన్ని సామాజికవర్గాల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్రప్రభుత్వం ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. మండలంలోని వడ్కాపూర్‌లో మాల సంఘ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. జూలపల్లిలో నిర్మించిన నాయీబ్రాహ్మణ సంఘం భవనాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ముందుచూపు కారణంగా అన్ని సామాజికవర్గాలకు పథకాలు అందుతున్నాయని తెలిపారు. ఆయనకు మరోసారి అండగా నిలవాలని సూచించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్‌సింగ్, ఎంపీపీ కూసుకుంట్ల రమాదేవి, సర్పంచులు నర్సింహయాదవ్, తిరుపతి, వైస్ ఎంపీపీ రమేశ్, ఎంపీటీసీలు మమత, వెంకటేశం, మల్లేశ్‌యాదవ్, కత్తెర్ల శ్రీనివాస్, పీఏసీఎస్ దూళికట్ట చైర్మన్ వేణుగోపాల్‌రావు తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి

173 మందికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

పెద్దపల్లిరూరల్: నియోజకవర్గంలోని 173 మంది లబ్ధిదారులకు ఆదివారం రూ.50,91,600 విలువైన చెక్కులను ఎమ్మెల్యే అందించారు. ఎంపీపీ, జెడ్పీటీసీలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని జాఫర్‌ఖాన్‌పేటకు చెందిన బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు బీఆర్‌ఎస్ చేరారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎంపీపీ నూనేటి సంపత్, జెడ్పీటీసీ వంగ తిరుపతిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ గజవెల్లి పురుషోత్తం, సర్పంచ్ దొమ్మాటి శ్రీనివాస్, ఎంపీటీసీ రమాదేవి, పార్టీ గ్రామ అధ్యక్షుడు చంద్రయ్య, రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

గోరింటాకు వేడుక



సుల్తానాబాద్: పట్టణంలోని శివాలయంలో శ్రీరాజరాజేశ్వరి కిట్టీ పార్టీ మహిళలు గోరింటాకుతో అమ్మవారికి వేడుక నిర్వహించారు. గోరింటాకు పెట్టుకుని మురిసిపోయారు. పండుగలు, శుభకార్యాల్లో మహిళలు మైదాకు పెట్టుకునేందుకు మక్కువ చూపుతారని, ఇది సంస్కృతిలో భాగమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



రక్షణపై సింగరేణి నజర్

- నెలరోజులు భద్రతా మాసోత్సవం
- ఫైఖరి, ప్రవర్తన, సంస్కృతి, క్రమశిక్షణపై దృష్టి
- గనులపై తనిఖీలు చేపట్టిన కార్పొరేట్ సేఫ్టీ జీఎం



తనిఖీలు నిర్వహిస్తున్న కార్పొరేట్ సేఫ్టీ జీఎం

గోదావరిఖని: కార్మికుల రక్షణపై సింగరేణి యాజమాన్యం ప్రత్యేక దృష్టి సారించింది. మైసేఫ్టీ మై రెస్పాన్స్‌బులిటీ నినాదంతో ముందుకు సాగుతోంది. ఈనెల ఒకటి నుంచి నెలాఖరువరకు కార్యక్రమాన్ని ఉద్యమంగా చేపట్టాలని యాజమాన్యం నిర్ణయించింది. ఏటా జూన్‌లో ప్రమాదాల సంఖ్య పెరుగుతోంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని గనులవారీగా ప్రమాదాలు, రక్షణ చర్యలపై విశ్లేషణతోపాటు అన్ని గనులను ఏరియా, రీజియన్, సింగరేణి స్థాయి బృందాలు ప్రత్యేక తనిఖీలు నిర్వహించనున్నాయి.

ప్రమాదాలు తగ్గించడమే లక్ష్యం..

సంస్థవ్యాప్తంగా ప్రమాదాలు తగ్గించడమే లక్ష్యంగా సేఫ్టీ విభాగం ముందుకు సాగుతోంది. 2021లో 13మంది మృతి చెందగా.. 2022లో ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. ఆరునెలల్లో జరిగిన రెండు ప్రమాదాల్లో ఇద్దరు చనిపోయారు. రానున్న రోజుల్లో ప్రమాదాల్లేని సింగరేణి లక్ష్యంగా ప్రతిఒక్కరూ ముందుకెళ్లాలని యాజమాన్యం యోచిస్తోంది.

మైసేఫ్టీ.. మై రెస్పాన్స్‌బులిటీ

ప్రతిఒక్కరూ స్వీయరక్షణతో ముందుకు సాగి ప్రమాదాలు లేకుండా చూడటమే లక్ష్యంగా ఈ నినాదాన్ని తీసుకవచ్చారు. దీనికోసం ఏ బీ సీ డీ కల్చర్ తీసుకరావాలని నిర్ణయించారు. అధికారులు గనులను సందర్శించి రక్షణచర్యలు, సేఫ్టీ మేనేజ్‌మెంట్‌ప్లాన్ (ఎస్ఎంపీ) పరిశీలించాలని, వాటిని అమలుచేసేందుకు అధికారులు బాధ్యత తీసుకుంటున్నారు.

ప్రమాదాల్లేని ఏరియాలివే..

సింగరేణి వ్యాప్తంగా 11 ఏరియాలు ఉన్నాయి. ఇందులో 7 ఏరియాలు ప్రమాదాలేకుండా సాగుతున్నాయి. కొత్తగూడెం, ఇల్లెందు, ఆర్జీ–1, ఆర్జీ–3, బెల్లంపల్లి, శ్రీరాంపూర్ ఏరియాలు రక్షణలో ముందంజలో ఉన్నాయి.

ఆందోళన కలిగిస్తున్న సాధారణ మరణాలు

సింగరేణిలో ప్రమాదాలు తగ్గగా.. సాధారణ మరణాలు పెరిగాయి. గుండెపోటు మరణాలు, రోడ్డు ప్రమాదాల్లో మృతుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. తొమ్మిదేళ్లలో 2,579 మంది సాధారణ సమస్యలతో చనిపోయారు. వీటిని తగ్గించడంపై కూడా సింగరేణి యాజమాన్యం దృష్టి సారించింది.

ఏడేళ్లలో ప్రమాదాలు ఇలా..

2016	12	2020	12
2017	12	2021	13
2018	07	2022	05
2019	08	2023	02

2014 నుంచి ఇప్పటివరకు ఏరియాల వారీగా మరణించిన కార్మికులు

ఆర్జీ–1	297	శ్రీరాంపూర్	569
ఆర్జీ–2	227	కొత్తగూడెం	201
ఆర్జీ–3	260	ఇల్లెందు	81
ఏపీఏ	61	మణుగూరు	149
భూపాలపల్లి	291	ఎస్టీపీపీ	04
బెల్లంపల్లి	73	కార్పొరేట్	110
మందమర్రి	256	మొత్తం	2579

ప్రతి ఒక్కరి బాధ్యత



ప్రమాదాల్లేని సింగరేణిగా తీర్చిదిద్దడం అందరి బాధ్యత. గనులవారీగా ఏ బీ సీ డీపై అవగాహన కల్పించాలని నిర్ణయించాం. 2015లో 22ప్రమాదాలు జరిగితే ఈ ఏడాది రెండు మాత్రమే చోటుచేసుకున్నాయి. రానున్న రోజుల్లో అవి కూడా లేకుండా చూస్తాం. సేఫ్టీ మేనేజ్‌మెంట్ ప్లాన్ ప్రతిఒక్కరూ తప్పని అమలు చేయాలి.

– గురువయ్య, కార్పొరేట్ సేఫ్టీ జీఎం

మల్లన్న సన్నిధిలో భక్తుల రద్దీ



ఓదెల:ఓదెల మల్లికార్జున స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాతోపాటు మహారాష్ట్ర నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఒగ్గు పూజారులతో స్వామివారికి పట్నాలు వేయించారు. బోనాలు చేసి నైవేద్యంగా సమర్పించారు. భక్తుల ఏర్పాట్లను ఈవో సదయ్య, చైర్మన్ మేకల మల్లేశం యాదవ్ పర్యవేక్షించారు.

పెద్దమ్మ తల్లికి బోనాలు

జూలపల్లి: మండలంలోని పెద్దాపూర్‌లో ముదిరాజ్ కులస్తులు పెద్దమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. మహిళలు బోనాలతో శోభాయాత్ర చేపట్టారు. అమ్మవారి ఆలయానికి చేరుకుని బోనం సమర్పించి మొక్కులు చెల్లించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్ సింగ్ బోనం ఎత్తుకున్నారు. వర్షాలు కురిసి ప్రజలు సుఖశాంతులతో ఉండాలని అమ్మవారిని కోరుకున్నారు. సంఘం నాయకులు బొజ్జ కనుకయ్య, పెద్ద మల్లయ్య, రాజేశం, పెద్దులు, గజ్జెల రాజేశం, నరేశ్, భూమయ్య ఉన్నారు.



క్లుప్తంగా

'సివిల్స్ ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోండి'

పెద్దపల్లిరూరల్: సివిల్స్ ఉచిత లాంగ్‌టర్మ్ కోచింగ్‌కు ఆన్‌లైన్‌లో ఈ నెల 10లోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి రంగారెడ్డి ఒక ప్రకటనలో అన్నారు. బీసీ సంక్షేమ శాఖ బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కోచింగ్ (ప్రిలిమ్స్ కమ్ మేయిన్స్) కోసం పెద్దపల్లి జిల్లాలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ డిగ్రీ పాసైన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. 50 మందిని నేరుగా, 100 మందిని ఆన్‌లైన్ స్క్రీనింగ్ టెస్ట్ ద్వారా ఎంపిక చేస్తారని తెలిపారు. లాడ్జింగ్, బోర్డింగ్, రవాణా సదుపాయాల కోసం నెలకు రూ.5 వేలు చెల్లిస్తారన్నారు. అలాగే ప్రవేశం పొందిన అభ్యర్థులకు రూ.5 వేల విలువైన స్టడీ మెటీరియల్ ఇస్తారని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 040-27077929, 77803 59322 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

'టెక్నీషియన్ల వెబ్ కౌన్సెలింగ్‌కు అంగీకారం'

గోదావరిఖని(రామగుండం): సింగరేణిలో పనిచేస్తున్న నాలుగు బ్యాచ్‌ల ఈపీ ఫిట్టర్, ఈపీ ఎలక్ట్రిషియన్ ట్రైనీల కోసం వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించేందుకు యాజమాన్యం నిర్ణయించిందని ఏఐటీయూసీ నేత డి.శేషయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే ఒక సంవత్సరం శిక్షణ పూర్తి చేసి, డిపార్ట్‌మెంటల్ టెస్ట్‌లో ఉత్తీర్ణత సాధించిన వారికి పోస్టింగ్‌లు ఇవ్వడం, అంతర్గత బదిలీలు కోరుకునే సీనియర్ టెక్నీషియన్లకు ఈ నెలలో వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించడానికి డైరెక్టర్(పా) అంగీకరించారని పేర్కొన్నారు. గతంలో రెండు బ్యాచ్‌లకే కౌన్సెలింగ్ నిర్వహిస్తామని జారీ చేసిన ఉత్తర్వులను ఏఐటీయూసీ ఆధ్వర్యంలో వ్యతిరేకించి, అన్ని బ్యాచ్‌లకు చేపట్టాలని కోరామన్నారు. ఈ మేరకు పాత ఉత్తర్వులు రద్దు చేసి, నాలుగు బ్యాచ్‌లకు ఒకేసారి కౌన్సెలింగ్ చేపట్టేందుకు అంగీకరించిందని తెలిపారు.

దాడి ఘటనలో ఒకరిపై కేసు

జూలపల్లి(పెద్దపల్లి): తెలుకుంట గ్రామానికి చెందిన మల్లారపు తిరుపతిపై దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటకృష్ణ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. తిరుపతిపై అదే గ్రామానికి చెందిన మల్లారపు నరేందర్ పాత కక్షలను మనసులో పెట్టుకొని, గత నెల 29న కర్రతో దాడి చేశాడు. ఈ ఘటనలో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు నరేందర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

కారు ఢీకొని యువకుడి మృతి


శ్రీనివాస్ (ఫైల్)

మంథని: మంథని డిగ్రీ కళాశాల సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని సూరయ్యపల్లికి చెందిన వడ్లకొండ శ్రీనివాస్ (38) మృతిచెందాడు. సూరయ్యపల్లి గ్రామం నుంచి మంథని మండలంలోని గుంజపడుగులో బంధువుల ఇంటికి శ్రీనివాస్ బైక్‌పై వెళ్తున్నాడు. అదే సమయంలో గోదావరిఖని వైపు నుంచి ఎదురుగా వస్తున్న కారు ఈయనను బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో శ్రీనివాస్ తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని స్థానికులు వెంటనే స్థానిక సామాజిక ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే చనిపోయినట్లు వైద్యులు తెలిపారు. శ్రీనివాస్‌కు భార్య లక్ష్మీ ఉంది. పట్టణ రెండో ఎస్సై రాణివర్మ ఆసుప్రతికి చేరుకుని సంఘటనకు సంబంధించిన వివరాలు తెలుసుకున్నారు.

పలువురిపై కేసు

సారంగాపూర్: బీర్‌పూర్‌కు చెందిన బొనగంటి మల్లయ్యకు డబ్బులు చెల్లించని వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. రంగపేటకు చెందిన రవి, బీర్‌పూర్‌కు చెందిన దుబ్బయ్య, మరికొందరు మల్లయ్య మేకలను తీసుకెళ్లారు. డబ్బులు చెల్లించలేదు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

కొత్త రేషన్ కార్డులు ఎప్పుడిస్తరో?

- మొత్తం దరఖాస్తులు 30,179
- ఆమోదించినవి 12,441
- తిరస్కరించినవి 1,322
- పెండింగ్‌లో మిగతావి
- జిల్లాలో 413 చౌక ధరల దుకాణాలు


రేషన్ షాపుల వద్ద బియ్యం దించుతున్న హమాలీలు

సుల్తానాబాద్(పెద్దపల్లి): ఏళ్లు గడుస్తున్నా ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు(ఆహార భద్రత కార్డులు) ఇవ్వడం లేదు. దీంతో ఎక్కువ సంఖ్యలో ఉన్న మధ్య తరగతి కుటుంబాలకు చెందినవారు ఇబ్బంది పడుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే ఉచిత బియ్యం కోల్పోవడంతోపాటు పలు రకాల సంక్షేమ పథకాలు వారికి దక్కడం లేదు. కార్డులో మార్పులు చేర్పులకు సైతం అవకాశం లేదు. పిల్లలు జన్మిస్తే వారి పేర్లు నమోదు చేయడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం 2016లో కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేసింది. అవి అరకొరగానే వచ్చాయి. ఆ తర్వాత దరఖాస్తు చేసుకున్న వారికి ఇంకా ఇవ్వలేదు.

జిల్లాలో 3,500 టన్నుల బియ్యం పంపిణీ

కొత్త రేషన్ కార్డుల కోసం పెద్దపల్లి జిల్లాలో 30,179 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో ఆమోదించినవి 12, 441, తిరస్కరించినవి 1,322, పెండింగ్ ఎంఆర్‌వో దరఖాస్తులు 736, పెండింగ్ డీఎస్‌సీవో అర్జీలు 8,125, కుటుంబ సభ్యులను చేర్చేందుకు 7,555 వచ్చాయి. వీటిపై తహసీల్దార్లు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. వివరాలను డీఎస్‌వో అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. అయినా ఇంతవరకు కార్డులు అందలేదు. జిల్లాలో 413 రేషన్ దుకాణాలు, 2,17,266 రేషన్ కార్డులు ఉన్నాయి. వీటిలో అంత్యోదయ 12,396, తెల్ల రేషన్ 2,04,687, అన్నపూర్ణ కార్డులు 193 ఉన్నాయి. ఈ లబ్ధిదారులకు ప్రతినెలా రేషన్ దుకాణాల ద్వారా 3,500 టన్నుల బియ్యం పంపిణీ చేస్తున్నారు.

తొలగింపు సరే.. చేర్పరేం?

కార్డులో పేరుండి చనిపోతే ఆన్‌లైన్ దరఖాస్తు చేయగానే వెంటనే తొలగిస్తున్నారు. కానీ కొత్తగా 7,555 మంది పేర్లు చేర్చాలని వచ్చిన అర్జీలపై ఇప్పటివరకు కదలిక లేదు. కొత్తగా పెళ్లయిన వారు, కొత్తగా పుట్టిన పిల్లల పేర్లను చేర్చాలని కోరితే అవకాశమే ఇవ్వడం లేదు.

వెబ్‌సైట్ నిలుపుదల..

కొత్త కార్డులు కావాలంటే మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలి. గతేడాది నుంచి ఆన్‌లైన్ వెబ్‌సైట్‌ను ప్రభుత్వం పూర్తిగా నిలిపివేసింది. కొత్త కార్డులతోపాటు మార్పులు చేర్పులు, పేర్ల నమోదుకు అవకాశం లేకుండా చేసింది. విషయం తెలియక చాలామంది మీసేవ కేంద్రాల చుట్టూ తిరుగుతున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో మంజూరు చేస్తారన్న ఆశతో ఉన్నారు.

కొత్త కార్డులు జారీ చేయాలి



ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు జారీ చేయాలి. కార్డు లేకపోవడంతో చాలామంది రేషన్ సరుకులు పొందలేక పోతున్నారు. పాత కార్డుల్లో పిల్లలను చేర్చాలి. ఈ విషయాలను అధికారులకు అడిగితే స్పందించడం లేదు.

– గెల్లు శ్రీనివాస్, సుల్తానాబాద్

ప్రభుత్వమే నిర్ణయం తీసుకోవాలి



కొత్త కార్డుల జారీ, పేర్ల నమోదు, మార్పులు చేర్పులపై ప్రభుత్వమే నిర్ణయం తీసుకోవాలి. వచ్చిన దరఖాస్తులు పరిశీలించి, అర్హులను ఎంపిక చేసి, సర్కారుకు నివేదించాం. ఇంకా మాకు ఎలాంటి ఆదేశాలు రాలేదు.

– తోట వెంకటేశ్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి

దూరవిద్య పితామహుడికి నివాళి

కరీంనగర్ సిటీ: సార్వత్రిక, దూరవిద్య పితామహుడు ప్రొఫెసర్ గడ్డం రాంరెడ్డి 28వ వర్ధంతిని ఎస్సారార్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఎదురుగా ఆర్.బి.వి.ఆర్.ఆర్.కూడలిలో ఉన్న ఆయన విగ్రహం వద్ద ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ, హైదరాబాద్ ఉప సంచాలకుడు డాక్టర్ ఇటిక్యాల రాజేందర్ రెడ్డి హాజరై, ప్రొఫెసర్ రాంరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలోనే మొదటి సార్వత్రిక విశ్వవిద్యాలయం డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ వ్యవస్థాపకుడు, మొదటి వైస్ ఛాన్సలర్‌గా పనిచేసిన రాంరెడ్డి కరీంనగర్ జిల్లా వాస్తవ్యులు కావడం మనందరికీ గర్వకారణమన్నారు. ఆయన ఇందిరా గాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ వ్యవస్థాపకుడని, వైస్ ఛాన్సలర్, యూజీసీ చైర్మన్, ఓయూ వైస్ ఛాన్సలర్‌గానూ సేవలందించారని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, ఆర్టీసీ మాజీ చైర్మన్ ఉచ్చిడి మోహన్ రెడ్డి, లయన్ మెతుకు సత్యం, రెడ్డి సంక్షేమ సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు నరహరి జగ్గారెడ్డి, కార్యదర్శి బండ గోపాల్ రెడ్డి, అర్జున అవార్డు గ్రహీత అంజనారెడ్డి, మాజీ కార్పొరేటర్ ఆకారపు భాస్కర్ రెడ్డి, ఎడబోయిన శ్రీనివాస్ రెడ్డి, మాజీ తహసీల్దార్ పెండ్యాల కేశవ రెడ్డి, ఓపెన్ యూ నివర్సిటీ కౌన్సిలర్లు హరిశంకర్, నారాయణరెడ్డి, సిబ్బంది, మైలారం గ్రామస్తులు పాల్గొన్నారు.

ముగిసిన స్కూల్ చిల్డ్రన్స్ చెస్ పోటీలు

కరీంనగర్‌స్పోర్ట్స్: కరీంనగర్‌లోని విశ్వనాథ్ చెస్ అకాడమీ అధ్యక్షుడు రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో రెండు రోజులుగా స్థానిక వైశ్య భవన్‌లో నిర్వహిస్తున్న తెలంగాణ స్టేట్ స్కూల్ చిల్డ్రన్స్ చెస్ పోటీలు ఆదివారం ముగిశాయి. వివిధ జిల్లాల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. సాయంత్రం జరిగిన కార్యక్రమంలో విజేతలకు అతిథులు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఆర్య వైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ కౌన్సిలర్ కన్న కృష్ణ, ఒలింపిక్ సంఘం జిల్లా ఉపాధ్యాక్షుడు తుమ్మల రమేశ్ రెడ్డి, నిర్వాహకులు రాజేంద్రప్రసాద్, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

స్తంభం పైనుంచి పడిన అన్‌మ్యాన్డ్ కార్మికుడు

- తలకు గాయాలతో ఆస్పత్రిలో చికిత్స
- జేఎల్‌ఎంను సస్పెండ్ చేసిన డీఈ

కొత్తపల్లి(కరీంనగర్): కరీంనగర్ టౌన్-6 పరిధిలో పని చేస్తున్న జేఎల్‌ఎం బి.రాజును సస్పెండ్ చేస్తూ టౌన్ డీఈ రాజం శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. కరీంనగర్‌లోని కెమిస్ట్ భవన్ పక్కనున్న అపార్ట్‌మెంట్‌లో ట్రాన్స్‌ఫార్మర్‌పై బల్లి పడి, హెచ్‌టీ ఫ్యూజ్ పోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఈ సమస్యను పరిష్కరించేందుకు జేఎల్‌ఎం రాజు, అన్‌మ్యాన్డ్ కార్మికుడు వెంకటేశ్ శనివారం ఉదయం 7 గంటలకు అపార్ట్‌మెంట్ వద్దకు చేరుకున్నారు. వెంకటేశ్ విద్యుత్ స్తంభం ఎక్కాడు. అదే సమయంలో విద్యుత్ సరఫరా జరగడంతో సీసీరోడ్డుపై పడ్డాడు. ఈ ఘటనలో అతని తలకు గాయాలవడంతో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతున్నాడు. ఏబీ స్విచ్‌లు, డీటీఆర్ బంద్ చేసినప్పటికీ విద్యుత్ సరఫరా జరగడంపై అధికారులు విచారణ చేపట్టనున్నారు. అన్‌మ్యాన్డ్ కార్మికుడి పరిస్థితి బాగానే ఉన్నట్లు తెలిసింది. కాగా అతన్ని స్తంభం ఎక్కించడాన్ని తీవ్రంగా పరిగణించిన డీఈ జేఎల్‌ఎంను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులిచ్చారు.

జేఎల్‌ఎం సస్పెన్షన్ అన్యాయం..

జేఎల్‌ఎం రాజును సస్పెండ్ చేయడం అన్యాయమని టీఈఈయూ-327 జిల్లా అధ్యక్షుడు యుగంధర్ అన్నారు. అన్‌మ్యాన్డ్ కార్మికుడు స్తంభం ఎక్కవద్దని సంస్థ నియమ నిబంధనల్లో లేదని, ఆఘమేఘాల మీద రాత్రిపూట సస్పెన్షన్ ఉత్తర్వులు ఇవ్వాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. కార్మికుడికి ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు.

బావిలో దూకి మహిళ ఆత్మహత్య

శంకరపట్నం(మానకొండూర్): మండలంలోని కేశవపట్నంకు చెందిన బొజ్జ రాధ ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. రాధ, దేవయ్య దంపతులకు అరవింద్ ఒక్కడే కుమారుడు. ఏడేళ్ల క్రితం అతను చనిపోయాడు. దీంతో రాధ అప్పటినుంచి కొడుకుపై బెంగ పెట్టుకుంది. మూడేళ్లుగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతోంది. ఈ క్రమంలో ఆదివారం గ్రామంలోని వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి భర్త పోలీసులకు సమాచారం అందించడంతో హెడ్‌కానిస్టేబల్ రామచంద్రం సంఘటన స్థలానికి చేరుకున్నారు. స్థానికుల సహాయంతో మృతదేహాన్ని బావిలో నుంచి బయటకు తీశారు. అనారోగ్యం, కొడుకుపై బెంగతోనే రాధ ఆత్మహత్య చేసుకున్నట్లు ఆమె భర్త ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ పేర్కొన్నారు.

మట్టిపెళ్ల కూలి కార్మికుడి దుర్మరణం

- మరో కార్మికుడికి తీవ్రగాయాలు


ఎల్లయ్య (ఫైల్)

వేములవాడరూరల్: బావి పనులు చేస్తుండగా మట్టిపెళ్ల కూలి కార్మికుడు మృతిచెందిన సంఘటన వేములవాడ మండలంలోని నమిలిగుండుపల్లి గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. వేములవాడ మండలంలోని నమిలిగుండుపల్లి గ్రామానికి చెందిన చిందం రాజయ్య అనే భూయజమాని బావిలో జనగామ జిల్లా పాలకుర్తి మండలం బొమ్మెనకు చెందిన ఆలకుంట ఎల్లయ్య (55)తో పాటు శివరాత్రి రాజు, ఆయన కుటుంబ సభ్యులు పని చేస్తున్నారు. ప్రమాదవశాత్తు పైనుంచి మట్టి పెళ్ల కూలడంతో ఎల్లయ్య, రాజుకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స కోసం ఎల్లయ్యను కరీంనగర్, రాజును హైదరాబాద్ తరలించగా కరీంనగర్‌లో చికిత్స పొందుతున్న ఆలకుంట ఎల్లయ్య మృతిచెందాడు. రాజు చికిత్స పొందుతున్నాడు. ఘటనపై ఎస్సై నాగరాజు విచారణ చేపట్టారు. మృతుడి కుమారుడు నవీన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు భూ యజమాని చిందం రాజయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి.

నీటిగుంతలో పడి మేస్త్రీ...

సిరిసిల్లక్రైం: సిరిసిల్ల మున్సిపల్ పరిధి భూపతినగర్ శివారులోని భావనకుంట చెరువునీటి గుంతలో పడి మేస్త్రీ మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు. గుంటూరు జిల్లా పెద్దపాలెంకు చెందిన ఒంటినీడి వీరాంజనేయులు మల్లారపు సాయి వద్ద మేస్త్రీ పనిచేస్తున్నాడు. ఆదివారం వీరాంజనేయులు భూపతినగర్ శివారులోని భావనకుంట చెరువులోకి బహిర్భూమికి వెళ్లగా.. ప్రమాదవశాత్తు నీటిగుంతలో పడి మృతిచెందాడు. మల్లారపు సాయి ఫిర్యాదుతో కేసునమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

గుండెపోటుతో గీత కార్మికుడి మృతి


లచ్చాగౌడ్ (ఫైల్)

గంగాధర(చొప్పదండి): మండలంలోని వెంకటాయిపల్లికి చెందిన రావుల లచ్చాగౌడ్ (55) గుండెపోటుతో మృతిచెందాడు. గ్రామస్తులు తెలి పిన వివరాల ప్రకారం.. లచ్చాగౌడ్ ఆదివారం సాయంత్రం తాటిచెట్లు ఎక్కి, ఇంటికి వచ్చాడు. కాసేపటికే ఒళ్లంతా చెమటలు పట్టి, గుండెపోటు రావడంతో చనిపోయాడు. మృతుడికి ఇద్దరు కుమారులు, ఒక కూతురు కాగా అందరికీ వివాహాలయ్యాయి.

చికిత్స పొందుతూ బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు..


నందిరెడ్డి (ఫైల్)

శంకరపట్నం(మానకొండూర్): మండలంలోని అంబాల్‌పూర్ బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు తుమ్మేటి నందిరెడ్డి చికిత్స పొందుతూ మృతిచెందారు. గ్రామస్తుల వివరాల ప్రకారం.. నందిరెడ్డి అంబాల్‌పూర్ ఉపసర్పంచ్‌గా పని చేశారు. కొంతకాలంగా ఆయన కిడ్నీ సంబంధ వ్యాధితో బాధ పడుతున్నారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నందిరెడ్డి ఆదివారం చనిపోయారు. మృతుడి భార్య ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): వెంకటాపూర్ శివారులో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం..ముస్తాబాద్ మండలం గూడెంకు చెందిన కర్ర నవీన్, వినయ్ ద్విచక్రవాహనంపై సిరిసిల్లకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో వెంకటాపూర్‌కు చెందిన కంకణాల విజయ్ మరో వ్యక్తి ద్విచక్రవాహనంపై సిరిసిల్లకు వెళ్తుండగా ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఇందులో వినయ్ పరిస్థితి విషమంగా ఉంది. క్షతగాత్రులను 108 వాహనంలో సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు.

4న స్పోర్ట్స్ స్కూల్స్‌లో ప్రవేశానికి ఎంపిక పోటీలు

గోదావరిఖనిటౌన్(రామగుండం): పాలకుర్తి, అంతర్గాం మండలాల్లోని విద్యార్థులకు స్పోర్ట్స్ స్కూళ్లలో ప్రవేశానికి మంగళవారం ఉదయం 9 గంటలకు ఎన్టీపీసీ జెడ్పీ హైస్కూల్‌లో ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు మండల విద్యాధికారి సంపత్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని హైదరాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో ఈ స్కూళ్లు ఉన్నాయన్నారు. నాలుగో తరగతి విద్యార్థులు తేదీ 01.09.2014 నుంచి 31.08.2015 మధ్య, ఐదో తరగతి చదువుతున్నవారు 01.09.2013 నుంచి 31.08.2014 మధ్య జన్మించి ఉండాలని పేర్కొన్నారు. ఎత్తు, బరువు చూసి, లాంగ్ జంప్‌తోపాటు పలు పోటీలు నిర్వహిస్తామన్నారు. ప్రతిభ కనబరిచిన వారిని జిల్లాస్థాయికి, జిల్లాస్థాయిలో సత్తా చాటినవారిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తారని తెలిపారు. అక్కడ ప్రతిభ కనబరిస్తే స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశం పొందుతారని అన్నారు. క్రీడా పోటీల్లో పాల్గొనే విద్యార్థులు స్టడీ, పుట్టిన తేదీ, కుల ధ్రువపత్రాలు, గతేడాది ప్రోగ్రెస్ కార్డు, ఆధార్‌కార్డు, 10 పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు తీసుకురావాలన్నారు. వివరాలకు పీఈటీ శోభారాణి ఫోన్ నంబర్ 98665,73416, సోమశేఖర్ ఫోన్ నంబర్ 83099 78003లో సంప్రదించాలన్నారు.

సెంటనరీకాలనీలో..

కమాన్‌పూర్(రామగిరి): స్పోర్ట్స్ స్కూళ్లలో ప్రవేశానికి ఈ నెల 4, 5 తేదీల్లో రామగిరి మండలంలోని సెంటనరీకాలనీ రాణీ రుద్రమదేవి క్రీడా మైదానంలో బాలబాలికలకు పోటీ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఎంఈవో సంపత్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాల కోసం మాధవి పీఈటీని 94414 40683 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

5న టెంపరరీ టౌన్‌షిప్‌లో..

జ్యోతినగర్(రామగుండం): స్పోర్ట్స్ స్కూళ్లలో ప్రవేశానికి రామగుండం మండల స్థాయి ఫిజికల్ టెస్ట్‌లను ఈ నెల 5న ఎన్టీపీసీ రామగుండం టెంపరరీ టౌన్‌షిప్‌లోని జిల్లా ప్రజా పరిషత్ హైస్కూల్ క్రీడా మైదానంలో నిర్వహిస్తున్నట్లు మండల విద్యాధికారి సంపత్‌రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వివరాలకు మండల ఎస్జీఎఫ్ సెక్రటరీ, ఫిజికల్ డైరెక్టర్ కొమురోజు శ్రీనివాస్‌ను 94403 94743 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

'అల్ఫోర్స్' ఐసెట్ ర్యాంకర్లకు సన్మానం



విద్యార్థినులను సన్మానిస్తున్న రవీందర్ రెడ్డి

కొత్తపల్లి(కరీంనగర్): కాకతీయ విశ్వవిద్యాలయం ఇటీవల ప్రకటించిన ఐసెట్-2023 ఫలితాల్లో రాష్ట్ర స్థాయి అత్యుత్తమ ర్యాంకులు సాధించిన అల్ఫోర్స్ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులను ఆ కళాశాల కరస్పాండెంట్ వి.రవీందర్ రెడ్డి ఆదివారం సత్కరించారు. కరీంనగర్ సీతారాంపూర్‌లోని కళాశాలలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జి.జాహ్నవి(108), బి.మేఘన (137), బి.గ్రీష్మ (161), సీహెచ్.హర్షిత (228), అర్షియా జాబీన్ (949), ఎస్.విద్య (995), సమీరా మెహరీన్ (1761), ఇ.అనూష (1950), శ్రావణి (2094)లను అభినందించారు. అలాగే 21 మంది విద్యార్థినులు 5 వేలలోపు, 64 మంది 10 వేలలోపు ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. డిగ్రీతోపాటు ఐసెట్, మ్యాట్, క్యాట్, బ్యాంకింగ్, ఇతర జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీ పరీక్షలకు శిక్షణనిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇది విద్యార్థులు ర్యాంకులు సాధించేందుకు దోహదపడుతోందని చెప్పారు. ప్రిన్సిపాల్ జి.శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాళ్లు బి.విజయలక్ష్మి, జి.చంద్రశేఖర్ రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌ల రద్దుకు ఉద్యమించాలి

- ఐఎఫ్‌టీయూ జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ అపర్ణ


మాట్లాడుతున్న డాక్టర్ అపర్ణ


గోదావరిఖని(రామగుండం): కార్మిక చట్టాలను తుంగలో తొక్కుతూ తీసుకువచ్చిన లేబర్ కోడ్‌ల రద్దుకు కార్మిక వర్గం ఉద్యమించాలని ఐఎఫ్‌టీయూ జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ అపర్ణ, ప్రధాన కార్యదర్శి టి.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా గోదావరిఖని యూనియన్ కార్యాలయంలో నిర్వహించిన సదస్సులో వారు మాట్లాడారు. కేంద్రంలో నరేంద్ర మోదీ, రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వాలు ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. కార్మిక హక్కుల పరిరక్షణకై, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, స్కీం వర్కర్ల పర్మినెంట్, నాలుగు లేబర్ కోడ్‌ల రద్దుకు పోరాడాలన్నారు. కేంద్రం కార్మికుల శ్రమను కార్పొరేట్ కంపెనీలు, బడా పెట్టుబడిదారులకు దోచిపెడుతోందని విమర్శించారు. సమాన పనికి సమాన వేతనం, కనీస వేతనం నెలకు రూ.27 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కె.రాజన్న, ఐ.కృష్ణ, ఎ.వెంకన్న, ఈ.నరేష్, బి.అశోక్, ఎం.దుర్గయ్య, రాంకీ, కె.లింగమూర్తి, బి.బుచ్చయ్య, ఎస్.మనోజ్, బి.రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

యువతి కిడ్నాప్ ఘటనలో పలువురిపై కేసు

రామడుగు(చొప్పదండి): మండలంలోని మోతె గ్రామానికి చెందిన యువతి కిడ్నాప్ ఘటనపై రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలంలోని ఎన్గల్ గ్రామానికి చెందిన మేరుగు శ్రీనివాస్, మరికొంత మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అంజయ్య తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. మోతెకు చెందిన బండారి మల్లవ్వ కూతురు మౌనిక శనివారం కరీంనగర్‌లో గ్రూప్-4 పరీక్ష రాసి, సాయంత్రం ఆటోలో ఇంటికి వస్తోంది. కొత్తపల్లి సమీపంలో శ్రీనివాస్‌తోపాటు మరికొందరు యువకులు ఆ ఆటోను వెంబడించారు. మౌనిక ఇంటి చేరుకున్నాక వారు రాత్రి 7.30 గంటలకు ఆటో, రెండు ద్విచక్రవాహనాలపై వచ్చారు. ఆమె తల్లిని ఇంట్లో ఉంచి, గొళ్లెం పెట్టారు. అనంతరం మౌనికను బలవంతంగా కిడ్నాప్ చేసి, తీసుకెళ్లారు. ఈ సంఘటనపై బాధితురాలి తల్లి ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో గృహోపకరణాలు దగ్ధం

- మహిళపై పడిన నిప్పురవ్వలు.. తప్పిన ప్రాణాపాయం


కాలిపోయిన విద్యుత్ మీటర్లు

కొత్తపల్లి(కరీంనగర్): కరీంనగర్ టౌన్-3 పరిధి వావిలాలపల్లిలో షార్ట్‌సర్క్యూట్‌తో పలు ఇళ్లలోని గృహోపకరణాలు టీవీలు, రిఫ్రిజిరేటర్లు, కూలర్లు, ఫ్యాన్లు, విద్యుత్ మీటర్లు కాలిపోయాయి. ఓ మహిళపై నిప్పురవ్వలు పడి, చున్నీ నిప్పంటుకుంది. అప్రమత్తమైన ఆమె వెంటనే చున్నీని తొలగించడంతో ప్రాణాపాయం తప్పింది. వివరాల్లోకి వెళ్తే.. కరీంనగర్ సర్కిల్ ఆఫీసు ఆవరణలోని 132/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి ధర్మారం వెళ్లే 33 కేవీ విద్యుత్ లైన్ కింద పలువురు గుడిసెలు, రేకుల షెడ్లు వేసుకున్నారు. 33 కేవీ టవర్‌కు ఆ ప్రాంతంలో ఉపయోగించే విద్యుత్, కేబుల్ వైర్లతో దండేలను ఏర్పాటు చేశారు. శనివారం సాయంత్రం ఇక్కడ మాంసం ముక్క ఎత్తుకెళ్తున్న ఓ కాకి ఆ విద్యుత్ లైన్‌పై వాలింది. ఫలితంగా ఇండక్షన్ వచ్చి, టవర్‌కు కట్టిన సర్వీస్, కేబుల్ వైర్ల ద్వారా షార్ట్‌సర్క్యూట్ జరిగింది. ఈ ఘటనలో నాలుగు ఇళ్లలోని విద్యుత్ పరికరాలన్నీ మాడిపోయాయి. ఫలితంగా బాధిత కుటుంబసభ్యులందరూ రాత్రంతా అంధకారంలోనే ఉన్నారు.

ఏడీఈ పరిశీలన..

విద్యుత్ ప్రమాదం జరిగిన ఇళ్లను ఆదివారం స్థానిక కార్పొరేటర్ గంట కల్యాణితో కలిసి కరీంనగర్ టౌన్-1 ఏడీఈ ఎస్.నరేందర్ పరిశీలించారు. 33 కేవీ టవర్‌కు ఇండక్షన్ రావడం వల్లే షార్ట్‌సర్క్యూట్ జరిగి, గృహోపకరణాలు, మీటర్లు కాలిపోయాయని నిర్ధారించారు. ముఖ్యంగా విద్యుత్ టవర్ల కింద షెడ్లు నిర్మించడం, వాటికి సర్వీస్, కేబుల్ వైర్లను దండేలుగా కట్టడం వల్లనే ఇలాంటి ప్రమాదాలు చోటుచేసుకుంటాయని చెప్పారు. ప్రస్తుత వర్షాకాలంలో మరిన్ని ప్రమాదాలు జరగకముందే టవర్ల కింద ఉన్న షెడ్లు, నిర్మాణాలను తొలగించుకోవాలని సూచించారు.

పాముకాటుతో మహిళా రైతు మృతి

కథలాపూర్ (వేములవాడ): భూషణరావుపేటకు చెందిన గోపిడి రాజు (57) అనే మహిళా రైతు ఆదివారం పాముకాటుతో మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన గోపిడి రాజు తన పంటచేనులో పెసర పంట సాగుచేసింది. పంట చేతికొచ్చిందని పెసర కాయలను తెంపేందుకు ఆదివారం ఉదయం వెళ్లింది. పెసరకాయను తెంపే క్రమంలో పాముకాటు వేసింది. అక్కడున్న వారు చికిత్సకోసం కోరుట్లలోని ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో కరీంనగర్‌లోని ఆస్పత్రికి తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. ఆస్పత్రి వద్దకు చేరుకోగానే ఆమె మృతిచెందింది. మృతురాలికి కుమారుడు, కూతురు ఉన్నారు. కుమారుడు తిరుపతిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై కిరణ్‌కుమార్ వివరించారు.